బాలల హక్కులను కాపాడుకుందాం

చౌదరిగూడ,నవంబరు 20(ఆంధ్రజ్యోతి) బాలల హక్కులను కాపాడుకుందామని తెలంగాణ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ అన్నారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలల కోసం రాజ్యాంగం ఎన్నో హక్కులను కల్పించిందని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం గోపినాథ్, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వణికిస్తున్న చలి

- ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు
- మర్పల్లిలో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

ఉమ్మడి జిల్లాలో చలి పంజా విసురుతోంది. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడి పోతున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో చలిగాలుల తీవ్రత పెరిగి పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం వికారాబాద్ జిల్లా మర్పల్లిలో అత్యల్పంగా ఉష్ణోగ్రత 10.6 డిగ్రీల నమోదైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో 11.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్ జిల్లా 13.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రంగారెడ్డి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి)



శత చండీ హోమానికి హాజరైన భక్తులు



ముగిసిన మైసిగండి బ్రహ్మోత్సవం

కడ్తాల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు వేడుకల్లో భాగంగా అమ్మవారిని కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శత చండీ హోమం పూర్ణాహుతితో ముగింపు పలికారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలీ పంతూ, ఈవో స్నేహలత, వీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ ఆర్పీ జ్యోతి, అరుణ్, భాస్కర్, యాట నర్సింహ్మ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో చంద్రశేఖర్

చేవెళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో గర్భిణులకు అన్ని రకాల వైద్యసేవలు అందించాలని, డెలివరీల సంఖ్య పెంచాలని సూచించారు. వైద్యులు సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, వైద్యులు ఉన్నారు.



కందుకూరు కొనుగోలు కేంద్రానికి నామమాత్రంగా వచ్చిన ధాన్యం

దళారులకే దండిగా!

వ్యాపారులకు ధాన్యం అమ్మేందుకే రైతుల మొగ్గు

జిల్లాలో రైతులు వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేట్ వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు. ధర తక్కువైనా పర్లేదు... కేంద్రాల నిర్వాహకులు పెట్టే కొర్రీలు పడలేమని దళారులకు అమ్మేస్తున్నారు. సెంటర్లలో అమ్మితే రోజుల కొద్దీ డబ్బు కోసం వేచిచూడలేక చకచకా పని కానిచ్చేస్తున్నారు. దీంతో అధికారులు వేసిన అంచనా తగ్గట్లు కేంద్రాలకు ధాన్యం రావడం లేదు. చాలాచోట్ల సెంటర్లు వెలవెలబోతున్నాయి.

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అంతంత మాత్రంగానే విక్రయం
- తేమ, తరుగు అంటూ కొర్రీలు పెడుతున్న కేంద్రాల నిర్వాహకులు
- ప్రభుత్వ మద్దతు ధరకంటే ఎక్కువ రేటు ఇస్తున్న వ్యాపారులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 80 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 247 మంది రైతుల నుంచి 1704.760 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. రూ.500 బోనస్ కోసం చూసుకుంటే తేమ శాతం 17 ఉండాలి. ఇందుకోసం ధాన్యం ఆరబెట్టాలి. ధాన్యం ఆరబెడితే క్వింటాలుకు ఆరు నుంచి ఏడు కిలోల వరకు బరువు తగ్గుతుంది. అరబెట్టే పని, అకాల వర్షం భయం, డబ్బుకోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ఇలా చాలా రిస్కులు తీసుకోవాల్సి వస్తుందని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నారు. లాభం, నష్టం చూసుకోకుండా కొంత మంది రైతులు క్వింటాలు వరి ధాన్యం రూ.2,050కే అమ్ముకుంటున్నారు. కొందరు ప్రైవేట్ వ్యాపారులు

మిగతా 8వ పేజీలో...

ధాన్యం కొనుగోలు వివరాలు

వరి సాగు విస్తీర్ణం	1,38,187 ఎకరాలు
సేకరణ లక్ష్యం	80,000 టన్నులు
సేకరించింది	704.760 మెట్రిక్ టన్నులు
కేంద్రాలు 38	రైతులు 247

ట్యాక్సీ, మోటార్ క్యాబ్ సబ్సిడీ నిలిపివేత

రంగారెడ్డి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ట్యాక్సీ, మోటార్ క్యాబ్ సబ్సిడీ నిలివేస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న టీ-ప్రైడ్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ లబ్ధిదారులకు టాక్సీ, మోటార్ క్యాబ్‌కు అందిస్తున్న రాయితీని ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వచ్చేనెల ఒకటో తేదీ నుంచి కొనే వాహనాలకు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. 2024 నవంబరు 30 వరకు కొన్న వాహనాలకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె చెప్పారు.

జిల్లాలో నేడు

కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లపై గురువారం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు రంగారెడ్డి జిల్లా, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.30 గంటల వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4 గంటల వరకు వికారాబాద్ జిల్లాకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనలతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో కల్పించనున్న రిజర్వేషన్లపై అభిప్రాయాలను, సూచలను, సలహాలను తెలిపేందుకు ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని ఆయన తెలిపారు.

సర్దార్‌నగర్ గ్రామపంచాయతీ వివరాలు తెలుసుకుంటున్న ఒడిశా బృందం



సర్దార్‌నగర్‌లో ఒడిశా బృందం

షాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామ పంచాయతీని ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా పంచాయతీలో జరుగుతున్న ఆన్‌లైన్ సేవలు, రికార్డుల నిర్వహణ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ అభివృద్ధికి నిధుల సమీకరణ, రాష్ట్ర నిధుల నిర్వహణ, ఉపాధిహామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనును పరిశీలించారు. నర్సరీ, సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రం, వైకుంఠధామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ మేనేజర్ అనిల్‌కుమార్, రుద్రయ్య, ఈవో శ్రీనివాస్, ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వీరాసింగ్, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడే..



బహిరంగ ప్రాంతాల్లో పరిశ్రమల వ్యర్థాలు

- దుర్గంధంతో ప్రజల ఇబ్బందులు
- విజృంభిస్తున్న దోమలు, ఈగలు
- పట్టించుకోని అధికారులు



తీగాపూర్ రోడ్డు పక్కన వదిలిన వ్యర్థాలు,
(ఇన్‌సెట్‌లో..) కొత్తూర్ పారిశ్రామికవాడలో పడేసిన వ్యర్థాలు

కొత్తూర్, నవంబరు 20:(ఆంధ్రజ్యోతి) : కొత్తూర్ పారిశ్రామికవాడతో పాటు మండలంలోని తిమ్మాపూర్, పెంజర్ల, కొడిచర్ల, ఇన్ముల్‌నర్వ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను వదిలేస్తున్నారు. వ్యర్థాల నుంచి వచ్చే కంపును భరించలేక ప్రజలు ముక్కు మూసుకొని పోవాల్సి వస్తుంది. అంతేకాకుండా దోమలు, ఈగలు వ్యాప్తి చెంది జనం రోగాల బారినపడుతున్నారు. కొత్తూరు పారిశ్రామిక వాడలో విరివిగా పరిశ్రమలు విస్తరించాయి. ఆ పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను పలువురు వాహనాల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో రహదారుల పక్కన, బహిరంగ ప్రాంతాల్లో పారబోసి వెళ్తున్నారు. ఆ వ్యర్థాల సమీపంలో పందులు తిరిగి దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. కొత్తూర్ పారిశ్రామికవాడ నుంచి తీగాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో ఓ ఐరన్ పరిశ్రమ ఉంది. దానికి సంబంధించిన క్వార్టర్స్ నుంచి వెలువడుతున్న మురుగునీరు రోడ్డుపై పారుతోంది. అంతేకాకుండా క్వార్టర్స్ వ్యర్థాలను రోడ్డుపై పారబోస్తున్నారు. దాంతో అ ప్రాంతమంతా దుర్గంధంగా మారిపోతుంది. అలాగే చికెన్ సెంటర్లలోని వ్యర్థాలు సైతం రోడ్డు పక్కన వదిలి వెళ్తున్నారు. ఇంతజరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి రోడ్ల పక్కన వ్యర్థాలను వదిలి వెళ్లేవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్వారీల పరిశీలన

కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలం మీర్కాన్‌పేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 112లో పలు క్రషర్లకు కేటాయించిన క్వారీలను బుధవారం మైనింగ్ ప్రిన్సిపాల్ కార్యదర్శి సురేంద్రమోహన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించారు. గత ప్రభుత్వం 112 సర్వే నంబర్‌లో 55 ఎకరాల భూమిని పలు క్వారీ కంపెనీలకు లీజుకు ఇచ్చింది. అయితే వీటిల్లో నిబంధనల మేరకు తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అనే దానిపై సర్వే చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ భూములను టీజీఐఐసీకి కేటాయించారని, అవసరమైతే క్వారీలకు ఇచ్చిన లీజు ప్రతిపాదనను వెనుక్కు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ఫ్యూచర్ సిటీకి క్వారీ నుంచి వెలువడే కంకర, డస్టు ఎంతవరకు ప్రభావం చూపుతుందని అధికారులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్ పాల్గొన్నారు.



మీర్కాన్‌పేటలోని క్వారీని పరిశీలిస్తున్న మైనింగ్ ప్రిన్సిపాల్ కార్యదర్శి సురేంద్రమోహన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి

ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న మేడిపల్లి యాదవ సంఘం నాయకులు

యాచారం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లిలో మల్లిఖార్జున స్వామి ఆలయ నిర్మాణం కోసం తనవంతు సహకారమందించనున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బుధవారం మేడిపల్లి యాదవ సంఘం నాయకులు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆలయ నిర్మాణం విషయమై మాట్లాడారు. త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసేందుకు సహకారమందించనున్నట్లు మల్‌రెడ్డి చెప్పారు. గ్రామాభివృద్ధికి విరివిగా నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. సురేష్, ముంత జంగయ్య తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రోడ్డు సర్వే పనులు

కందుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్కాన్‌పేట, బేగరికంచ గ్రామాల్లో నెలకొల్పనున్న ఫ్యూచర్‌సిటీ వరకు రోడ్డు సర్వే పనులు బుధవారం రాచులూరు రెవెన్యూ పరిధిలో పోలీసుల బందోబస్తు మధ్య కొనసాగాయి. కందుకూరు, మహేశ్వరం సీఐలు సీతారాం, వెంకటేశ్వర్లు పోలీసులను మోహరించి సర్వే కొనసాగించారు. తహసీల్దార్ కె.గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం రావిరాల ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నెంబర్ 13 నుంచి మండలంలోని లేమూరు, అగర్‌మియాగూడ, తిమ్మాపురం, రాచులూరు, గుమ్మడవెల్లి రెవెన్యూ గ్రామాల మీదుగా బేగరికంచలో నెలకొల్పనున్న ఫ్యూచర్ సిటీ వరకు 330 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వేయడానికి సర్వే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో సర్వే పూర్తిచేసి రైతులతో ఆర్డీవో అనంతరెడ్డి నేతృత్వంలో పరిహారం విషయాన్ని చర్చించనున్నట్లు తెలిపారు.

అగర్‌మియాగూడలో నేడు రైతులతో సమావేశం

ఫ్యూచర్ సిటీ వరకు రోడ్డుకోసం భూములు కోల్పోతున్న అగర్‌మియాగూడ రైతులతో నేడు(గురువారం) ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు రైతు సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.45 గంటలకు అగర్‌మియాగూడ రైతులతో ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్‌లు రైతులతో ముందుగా చర్చించాక సర్వే కొనసాగిస్తారని ఆయన తెలిపారు. అగర్‌మియాగూడ రైతులతో పాటు నగరంలోని రైతులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ

శంకర్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్, ర్యాగింగ్, మైనర్లకు డ్రైవింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్‌తో పాటుగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు స్నేహ పూర్వకంగా మెలగాలని, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సుందరయ్య తదితరులు ఉన్నారు.

నాగసమందర్ పంచాయతీలో
డీపీవో తనిఖీ

ధారూరు, నవంబరు 20: నాగసమందర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని నర్సరీ, వైకుంఠధామం, కంపోస్టుషెడ్, పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ స్థలంలో వేసిన డబ్బాను తొలగించాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో షఫీవుల్లా ఉన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. ఈమేరకు డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీలలోని పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫరూఖ్‌నగర్ మండల శాఖ నాయకులు హైమద్ పాష, లాలయ్య, శివ, శ్రీశైలం, యాదయ్య, శివకుమార్, కృష్ణముదిరాజ్, రమేష్ ముదిరాజ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పాలకమండళ్లు

నియామకానికి నోటిఫికేషన్.. ఏడాది గడువుతో కమిటీల ఏర్పాటు

తాండూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల రెండోదశ పందేరం మొదలైంది. ఇప్పుడు ఆలయాల పాలక మండళ్లను నియామకానికి ప్రక్రియ షురువైంది. 20 రోజుల్లో ప్రక్రియను పూర్తిచేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలు జారీ చేశారు. తాండూరు నియోజకవర్గంలో చారిత్రక తాండూరు నడిబొడ్డున ఉన్న భావిగి భద్రేశ్వర స్వామి, పొట్లి మహరాజ్, కాళికాదేవి, రసూల్‌పూర్ అంజనేయస్వామి నగరేశ్వరాలయం, స్టేషన్ హనుమాన్, బాలాజీ మందిర్, భద్రేశ్వర్‌చౌక్ అంజనేయాలయం, యాలాల మండలం జుంటుపల్లి రామస్వామి ఆలయం, బషీరాబాద్ మండల నీళ్లపల్లి ఏకాంబరేశ్వర రామలింగేశ్వర ఆలయాలకు చైర్‌పర్సన్లు, కమిటీ మెంబర్ల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తులను ఇప్పటికే రంగారెడ్డి దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆఫీసులో అందజేశారు. కోత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయానికి కమిటీ ప్రక్రియ పూర్తయ్యింది. కొత్త పాలకమండళ్ల గడువు ఏడాది ఉంటుందని ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొంది. గతంలో ఈ గడువు మూడేళ్లుండేది. దానికి రెండేళ్లకు ఇప్పుడు ఏడాదికి కుదించారు.

భద్రేశ్వరాలయానికి అభివృద్ధి కమిటీ

తాండూరు భద్రేశ్వర్ ఆలయానికి పాలకమండలి ఏర్పాటుపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పూర్తిస్థాయి పాలకమండలి కాకుండా ఈ గుడికి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తారు. భద్రేశ్వరాలయ జాతరను ప్రతీ ఏట నిర్వహిస్తారు. కొంత కాలంగా పాలకమండళ్లు కాకుండా అభివృద్ధి కమిటీని నియమించి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనల్లో పలువురు పేర్లు

భద్రేశ్వరాలయ అభివృద్ధి కమిటీకి వీరశైవ యువదళ్ నాయకుడు పటేల్ కిరణ్ పేరును చైర్మన్‌గా ప్రతిపాదించారు. పొట్లి మహరాజ్ ఆలయానికి ప్రసాద్‌గౌడ్, కాళికాలయానికి మాజీ కౌన్సిలర్ బస్వరాజ్, స్టేషన్ హనుమాన్ ఆలయానికి మిస్కిన్ శంకర్, నగరేశ్వర దేవాలయానికి దాదాపూరం సతీష్ పేర్లను ఇప్పటికే జిల్లా ఎండోమెంట్ కార్యాలయానికి పంపినట్టు తెలుస్తోంది.


తాండూరులోని భావిగి భద్రేశ్వరస్వామి ఆలయం

కమిటీలకు ఇంకా ఉత్తర్వులు రాలేదు

జిల్లాలోని ఆలయాలకు పాలక మండళ్ల నియామకంపై ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ అక్టోబరు 10న నోటిఫికేషన్ ఇచ్చారు. నిమాయకాలకు సంబంధించి ప్రభుత్వానికి ఇప్పటికే పలువురి పేర్లను ప్రతిపాదించారు. సర్కారు నియామకాలకు ఉత్తర్వు రావాల్సి ఉంది. అయితే త్వరలో ఉత్సవాలు జరగనున్న భద్రేశ్వరాలయానికి మాత్రం అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయనున్నారు.

- శేఖర్‌గౌడ్, ఎండోమెంట్ ఈఓ

విద్యార్థులకు నాణ్యమైన
భోజనం అందించాలి


చారును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

యాలాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. బుధవారం గంగసాగర్‌లో అసైన్డ్ భూమిని పరిశీలించారు. అనంతరం రాస్నం అంగన్‌వాడీ కేంద్రాన్ని, భాగాయిపల్లిలోని పాఠశాలను తనిఖీచేశారు. మధ్యాహ్నం విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం పెట్టాలని వంటవారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎంకు భోజనంపై సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ అంజయ్య, ఆర్‌ఐ చరణ్ ఉన్నారు.

భూ కైలాస్ ఆలయాన్ని దర్శించుకున్న సబ్ కలెక్టర్

తాండూరు రూరల్: అంతారం భూకైలాస్ మహాశివుడిని సబ్ కలెక్టర్ ఉమాశంకర్, ఆయన కుటుంబీకులు సందర్శించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. పూజారి రవి సబ్‌కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌గౌడ్

స్థానిక సంస్థల్లో బీసీలకు
42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

తాండూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వర్‌రావును బుధవారం బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, తాండూరు వాసి ఈడిగ శ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని, జనాభాలో 55శాతానికిపైగా ఉన్న బీసీలకు 18శాతమే రిజర్వేషన్ ఇస్తున్నారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను పెంచి స్థానికసంస్థల ఎన్నికలు పెట్టాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా కాలయాపన చేయొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నరేష్, నర్సింహ, చందు ఉన్నారు.


ప్రపంచ బాలల దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా ప్రపంచ బాలల దినోత్సవం

కీసర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ పద్మజారావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. విద్యార్థులు బాగా చదివి నవసమాజ నిర్మాణానికి కృషిచేయాలన్నారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి

డిసెంబరు 19 నుంచి 22వరకు
ఇసామి ఫోరం సమావేశం

ఆమనగల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో డిసెంబర్ 19 నుంచి 22వ తేదీ వరకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇసామి ఫోరం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ సందడి నరేందర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కోటేశ్వర్ రావు, మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డిలు తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న సమావేశాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్‌రెడ్డి, కోటేశ్వర్ రావు, చెన్నకిషన్ రెడ్డిలు మాట్లాడుతూ దేశస్థాయి లయన్ ఇసామి ఫోరం సమావేశానికి ప్రముఖులు హాజరవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో లయన్స్‌క్లబ్ జిల్లా వైస్‌గవర్నర్ మహేంద్రకుమార్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ సత్యనారాయణ, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, తదితరులున్నారు.

యువత శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రగామి దిశగా భారత్
- రక్షణశాఖ సాంకేతిక సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాబోవు కాలంలో భారత్ అగ్రగామిగా నిలవనుందని రక్షణ శాఖ సాంకేతిక సలహాదారు, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యూత్ సౌజన్యంతో బుధవారం ఇన్‌స్పైర్ ఇండియా డిఫెన్స్ స్పేస్ కన్వెన్షన్-2024 సదస్సు నిర్వహించారు. సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలోని యువతకు డిఫెన్స్, స్పేస్ రంగాల్లో అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు దోహదపడతాయని చెప్పారు. యువత భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. డిఫెన్స్, స్పేస్ రంగాల్లో విద్యార్థుల అభిరుచిని పెంపొందించేందుకు కృషి చేస్తున్న విద్యాలయాల యాజమాన్యాలను అభినందించారు. డా.రాజాసింగ్ తంగదురై, ప్రోగ్రాం డైరెక్టర్ డా.అశోక్‌కుమార్ పాండే, కె.శ్రీనివాసరాజు, సీఈవో జి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఫాజిజ్, గ్రూప్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ సతీష్‌రెడ్డి తదితరులు


టీడీపీ సభ్యత్వం ఇస్తున్న బక్కని నర్సింహులు, భూపాల్‌రెడ్డిలు

తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తేవాలి

రాజేంద్రనగర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, మాజీ ఎంపీ కంబంపాటి రామ్మోహన్‌రావు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్‌రెడ్డిలు అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పరపల్లి సామ భూపాల్‌రెడ్డి గార్డెన్స్‌లో బుధవారం టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కె.వెంకటేశ్ గౌడ్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. అందుకు ముందు పార్టీ నాయకులు టీడీపీ జెండాను ఎగురవేశారు. పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకుడు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ, టీడీపీకి రాబోయే రోజుల్లో తెలంగాణలో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహేశ్వరం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు రాఘవులు, ఎన్.వెంకటేశ్, అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ 'డౌన్'

యువర్ పేమెంట్ ఈజ్ అండర్ ప్రాసెస్.. ప్లీజ్ వెయిట్ 15 మినిట్స్

- టెట్ దరఖాస్తు చేస్తుంటే వెబ్‌సైట్‌లో దర్శనం
- నాలుగు రోజులుగా ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు
- మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ కేంద్రాల వద్ద పడిగాపులు
- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- గడువు పెంచాలని వేడుకోలు


టెట్ అప్లై చేయడానికి మీ సేవకు వచ్చిన అభ్యర్థులు

కేశంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలంలో టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) రాయాలనుకునే అభ్యర్థులు దరఖాస్తు కోసం నాలుగు రోజులుగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అప్లై చేస్తుంటే సర్వర్ డౌన్ అవుతుండటంతో మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. టెన్ దరఖాస్తు చేయాలంటే వెబ్‌సైట్‌లో ముందుగా వివరాలు నమోదు చేయాలి. అనంతరం పేమెంట్ చేయాల్సి ఉంటుంది. అయితే అభ్యర్థులు తమ వివరాలను ఆన్‌లైన్ చేసి పేమెంట్ చేయడానికి ప్రయత్నిస్తే యువర్ పేమెంట్ ఈజ్ అండర్ ప్రాసెస్ ప్లీజ్ వెయిట్ 15 మినిట్స్ అంటూ వెబ్‌సైట్‌లో దర్శనమిస్తుంది. ఇలా ఎన్నిసార్లు ప్రయత్నించినా ఇలాగే వస్తుండడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం టీజీటెట్ 2024 (సెకండ్ ఫేస్) నిర్వహించడానికి ఈ నెల మొదటి వారంలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 7 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థి ఫీజు చెల్లించి, తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపింది. టీజీ టెట్ 2024 (ఫస్ట్ ఫేస్) రాసిన అభ్యర్థులకు ప్రస్తుతం నిర్వహించే టెట్‌లో ఫీజులో మినహాయింపు ఇచ్చింది. బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారితో పాటు ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు కూడా పరీక్ష రాసుకోవడానికి అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలతో 7వ తేదీ నుంచి మొదలైన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ 16వ తేదీ వరకు సజావుగా సాగింది. 17వ తేదీ నుంచి టెట్ సర్వర్ డౌన్ అయ్యింది. అడపాదడప వస్తున్నా పేమెంట్ చేసే క్రమంలో డౌన్ అవుతుంది. దీంతో వివరాలు నమోదు చేయలేక అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. టెట్‌కు పూర్తి వివరాలను నమోదు చేయాలంటే మొదట పేమెంట్ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఇతర వివరాలను నమోదు చేసుకునే ఆవకాశం ఉంటుంది. సర్వర్ డౌన్ కావడంతో జిల్లాలో వేలాది మంది అభ్యర్థులు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వర్ డౌన్ కావడంతో అక్కడే పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ డౌన్ కావడంతో నాలుగు రోజులుగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయలేకపోతున్నామని అభ్యర్థులు వాపోతున్నారు. ఎంతో కాలంగా టెట్ రాయడానికి ఎదురుచూస్తున్నామని, సర్వర్ డౌన్ కావడంతో టెట్ రాసే ఆవకాశం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం టెట్ గడువును పొడిగించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



సర్వర్ డౌన్ ఉన్నట్లు కనిపిస్తున్న దృశ్యం

సర్వర్ రావడం లేదు



టెట్ అప్లికేషన్ చేయడానికి సర్వర్ రావడం లేదు. నాలుగు రోజులుగా ఇదే తంతు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన అభ్యర్థులు మీసేవ కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. వెబ్‌సైట్‌లో టెక్నికల్ సమస్యలు గుర్తించి, టెక్నికల్ సిబ్బందితో మాట్లాడినా సమస్య పరిష్కారం కావడంలేదు. వెబ్‌సైట్ రాకపోతే మేం చేసేదేమీ లేదు.

శ్రీనివాస్, మీసేవ నిర్వాహకుడు, కేశంపేట

టెట్ దరఖాస్తు గడువు పొడిగించాలి



టెట్ అప్లికేషన్ చేయడానికి మీ సేవకు వెళ్తే సర్వర్ డౌన్‌లో ఉందని చెబుతున్నారు. నాలుగు రోజులుగా సర్వర్ డౌన్ ఉంటే ఫీజు ఎలా చెల్లించాలి. బుధవారంతో టెట్ అప్లికేషన్ చేయడానికి గడువు ముగిసింది. అధికారులు స్పందించి వేలాది విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని టెట్ అప్లికేషన్ గడువును పొడిగించాలి.

జి. విజయలక్ష్మి, కేశంపేట

వరి కొయ్యలను కాల్చొద్దు


అంతారం తండాలో వరి కొయ్యను పరిశీలిస్తున్న డీఏవో మోహన్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వానకాలంలో వేసిన వరిని కోసి రైతుల కొయ్యకాళ్లకు నిప్పుపెట్టొద్దని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం అంతారం తండాలో వరి కొయ్యలను ఆయన పరిశీలించారు. రైతులు కొయ్యకాళ్లను కాల్చుతుండాన్ని చూసి వారితో మాట్లాడారు. వరికొయ్యను కాల్చితే భూమిలోని నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు కాలిపోతాయని చెప్పారు. వరి కొయ్యల పొగతో వాయు వాయుకాలుష్యం ఏర్పడి కార్బన్‌డయాక్సైడ్‌తో ఊపిరితిత్తుల సమస్యలకు దారితీస్తుందన్నారు. అలాగే మట్టిలో ఉండే పంటలకు మేలుచేసేసూక్ష్మజీవులు చనిపోతాయన్నారు. వరి కొయ్యలు కాలిస్తే ఇన్ని రకాలు నష్టం ఉంటుందని వివరించారు. కాబట్టి రైతులు కొయ్యకాళ్లను కాల్చకుండా అవి భూమిలో కలిసేలా కలియదున్నాలని సూచించారు. అనంతరం రైల్వే ఫ్లైఓవర్ సమీపంలోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏవో కొమరయ్య ఉన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: వరికోతల అనంతరం కొయ్యకాళ్లను కాల్చితే వాయు కాలుష్యం ఏర్పడుతుందని ఘట్‌కేసర్ ఏవో బాసిత్ అన్నారు. ఎదులాబాద్‌లోని రైతువేదిలో రైతులతో మాట్లాడుతూ కొయ్యకాళ్లను కాల్చడం వల్ల భూమిలోని నత్రజని, భాస్వరం, పోటాషియం, ఇతర సేంద్రియ పదార్థాలు, మిత్ర పురుగులు నాశనం అవుతాయన్నారు. ఎఈవో జగదీష్, రైతులు పాల్గొన్నారు.

మేధస్సు, శ్రమతోనే అద్భుతాల సృష్టి



సుబ్రహ్మణ్యాన్ని సన్మానిస్తున్న గోవిందరెడ్డి

కీసర రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేధస్సుకు శ్రమను జోడిస్తే అద్భుతాలను సృష్టించొచ్చని సీరో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ జీఎం డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం రాంపల్లిలోని కేజీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీలో నూతనంగా ఫార్మసీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. దేశం ఫార్మా ఉత్పత్తుల్లో అగ్రస్థానంలో ఉందన్నారు. కాలానుగుణంగా టెక్నాలజీని పెంపొందించుకుంటూ ఉద్యోగాలు సాధించాలన్నారు. కళాశాల చైర్మన్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభ చూపే ప్రతీ విద్యార్థికి కళాశాల అనుబంధ ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలిస్తామని తెలిపారు. కీసర సీఐ వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టాలకు లోబడి విద్యాభ్యాసాన్ని పూర్తి చేయాలని, చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాలేజి డైరెక్టర్ రమణారావు, ప్రిన్సిపాల్ విజయకుమార్, శిల్పిక, నాగరాజు, సింధూజ, రాధిక, సుసాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

లగచర్ల గిరిజనులకు సంఘీభావం

- కడ్తాలలో బీఆర్ఎస్ గిరిజన నేతల ర్యాలీ

కడ్తాల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా లగచర్ల గిరిజనులకు మద్దతుగా బుధవారం కడ్తాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ గిరిజన నేతలు సంఘీభావం తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అల్లుడి స్వలాభం కోసం సీఎం అమాయక గిరిజనుల భూములను ఫార్మా పేరుతో లాక్కోవడానికి చూస్తున్నారని మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, బీఆర్ఎస్ ఆమనగల్లు పట్టణాధ్యక్షుడు పత్యానాయక్, మాడ్గుల మాజీ ఎంపీపీ జైపాల్‌నాయక్‌లు ఆరోపించారు. అనంతరం దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో లగచర్లకు తరలి వెళ్లారు. నాగులు, లచ్చిరామ్ నాయక్, సేవ్యనాయక్, తులసీరామ్ నాయక్, లోకేశ్ నాయక్, హరిచంద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ అర్బన్ : పోలీసుల అదుపులో రాంబల్‌నాయక్, గిరిజన సంఘాల నాయకులు

లంబాడీల భూముల జోలికొస్తే తిరగబడతాం

షాద్‌నగర్ అర్బన్/కొత్తూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి లంబాడీల భూముల జోలికొస్తే తిరుగుబాటు తప్పదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ హెచ్చరించారు. చలో లగచర్ల కార్యక్రమానికి ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్రశాఖ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఎల్‌హెచ్‌పీఎస్, గిరిజన సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. రాంబల్‌నాయక్ మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్ ఫార్మా కంపెనీలకు ధారాదత్తం చేయడానికి లగచర్లలోని 1,300 ఎకరాల గిరిజన భూములను లాక్కోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుందన్నారు. గిరిజనులపై కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇకముందు గిరిజనుల భూముల జోలికోస్తే ఆందోళన తప్పదని రాంబల్‌నాయక్ హెచ్చరించారు. గిరిజన సంఘాల నాయకులు విస్లావత్ చందర్‌నాయక్, జర్పుల లింబ్యానాయక్, వి. చందునాయక్, లక్ష్మణ్‌నాయక్, తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు. అలాగే చలో లగచర్ల సందర్భంగా కొత్తూర్ ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సాయంత్రం వదిలిపెట్టారు. నాయకులు లక్ష్మణ్‌నాయక్, గోపాల్‌నాయక్, మోహన్‌నాయక్, నర్సింహ, బలరాం, చందర్‌లను అరెస్ట్ చేశారు.


కార్తీకదీప పూజలు చేస్తున్న దినేష్‌రెడ్డి

కార్తీక దీపోత్సవంలో మాజీ డీజీపీ

కీసర, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసోత్సవంలో భాగంగా బుధవారం కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో ఏపీ మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి పాల్గొన్నారు. మొదట గర్భాలయంలోని మూలవిరాట్టుకు రుద్రాభిషేకం నిర్వహించి, శివదుర్గ అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వీధులను శుభ్రంగా ఉంచుకోవాలి

చేవెళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్ తెలిపారు. బుధవారం మండలంలోని 37 గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో ప్లాస్టిక్ కవర్లు తొలగించారు. పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో వారం రోజులపాటు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడంతో, పచ్చిమొక్కలు తొలగించడం, బ్లీచింగ్ పౌడర్, పినాయిల్ చల్లడం తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలందరు ఇళ్లముందు చెత్తవేయవద్దన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


కౌకుంట్ల గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

మహేశ్వరం 'ఏఎంసీ చైర్మన్' కందుకూరుకేనా?

- కేఎల్లార్ ఏకపక్ష నిర్ణయాలతో పార్టీకి దూరమౌతున్న మహేశ్వరం గిరిజన నాయకులు
- చైర్మన్ కుర్చీకోసం ఆశపడి భంగపడిన నాయకులను బుజ్జగించే పనిలో మాజీ ఎమ్మెల్యే
- నాలుగోసారీ కందుకూరుకు చెందిన వ్యక్తినే ప్రతిపాదించడంపై నాయకుల గుర్రు..



మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మహేశ్వరం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎనిమిది మాసాలుగా మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేక రైతులకు అందాల్సిన పలురకాల సేవలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇటు పాలక వర్గం అటు ప్రభుత్వ పర్యవేక్షణలేక రైతులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోక తప్పడంలేదు. మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని వేయికళ్లతో ఎదురు చూస్తున్న మహేశ్వరం మండల కాంగ్రెస్ గిరిజన నాయకులకు చివరకు నిరాశే మిగిలింది. మహేశ్వరం మార్కెట్ కమిటీ రిజర్వేషన్లను గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2015-16లోనే 5 విడతలుగా ఒకేసారి లాటరీ పద్ధతిన ప్రకటించింది. ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ నుంచి 2015లో విడిపోయి నూతనంగా ఏర్పాటైన మహేశ్వరం మార్కెట్ కమిటీకి రెండు పర్యాయాలు జనరల్ మహిళ, మూడో విడత జనరల్, నాలుగో విడత ఎస్టీ జనరల్, ఐదో విడత జనరల్ మహిళకు రిజర్వేషన్ కింద కేటాయించారు. ప్రస్తుతం కొలువుదీరనున్న మహేశ్వరం మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ ఎస్టీ జనరల్‌కు రిజర్వేషన్ కావడంతో కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు చైర్‌పర్సన్ కోసం కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకుంటూ ఎంతోకాలంగా పార్టీ కోసం తాము చేసిన కృషిని వివరిస్తున్నారు. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్న సమయంలో నియోజకవర్గం ఇన్‌చార్జీగా ఉన్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) మూడు పర్యాయాలు కందుకూరు మండల నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొనసాగారని.. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో మహేశ్వరానికే మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్తామని హామీ ఇచ్చిన కేఎల్లార్.. చివరి నిమిషంలో నాలుగోసారీ కందుకూరు మండలానికి చెందిన కృష్ణానాయక్ పేరును చైర్మన్‌గా ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దాంతో మహేశ్వరం మండల కాంగ్రెస్ గిరిజన నాయకులు, కార్యకర్తలు ఆగ్రహంతో కేఎల్లార్‌పై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

నాలుగో విడతా కందుకూరుకేనా?

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీని 2015-16లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చైర్మన్ పదవిని మూడు విడతలుగా కందుకూరు మండలానికి చెందిన నేతలకే కేటాయించడంతో ఈసారి మహేశ్వరం మండలానికి చెందిన నాయకులకే పదవి వరిస్తుందన్న ఆశలు కూడా ఆవిరయ్యాయి. నాలుగో విడత కందుకూరు మండల నాయకులకే చైర్మన్‌గిరి దక్కుతుండడంతో మహేశ్వరం మండల గిరిజన నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ కేఎల్లార్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. చైర్మన్ కుర్చీ కోసం ఆశపడి భంగపడిన గిరిజన నాయకులైన కృష్ణానాయక్, విఠల్‌నాయక్, రాజునాయక్, పాండునాయక్‌లను బుజ్జగించేందుకు కేఎల్లార్ మధ్యవర్తుల ద్వారా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

క్రైం కార్నర్

గొంతులో మటన్ ముక్క ఇరుక్కొని వ్యక్తి మృతి


జంగయ్య (ఫైల్)

షాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : గొంతులో మటన్ ముక్క ఇరుక్కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం షాబాద్ మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన కావలి జంగయ్య (58) షాబాద్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బంధువుల పెళ్లికి హాజరయ్యాడు. పెళ్లిలో భోజనం చేస్తుండగా గొంతులో మటన్ ముక్క ఇరుక్కుని మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

కేశంపేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోమాల్‌పల్లికి చెందిన కేశంపేట మల్లేష్(24) గత శనివారం లేమామిడి శివారులో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడు కోమాలోకి వెళితే ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వివరించారు. మృతునికి భార్య మంజుల, ఇద్దరు కూతుళ్లున్నారు. వారిలో ఒకరికి రెండేళ్లు, మరొకరు 10రోజుల నవజాత శిశువు. మల్లేష్ వైద్యం, మందుల కోసం దాతలు విరాళాలు ఇచ్చారు. మల్లేష్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

కుళ్లిన స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి కథనం మేరకు.. బొంగ్లూరు ఔటర్ సర్వీస్ రోడ్డు కోయడ వెళ్లే దారిలో అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకొని మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. సీఐ, ఎస్సై బాల్‌రాజ్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించగా చున్నీతో చెట్టుకు ఉరేసుకొని సుమారు (55) సంవత్సరాలు వయస్సు ఉన్న వ్యక్తి మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడు వారం క్రితం మృతిచెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించగా ప్యాంటు జేబులో బీడీలు, అగ్గిపెట్టెతో పాటు తీవ్రమైన కడుపు నొప్పి కారణంగా తాను చనిపోతున్నాను అంటూ తన కుమార్తె ఉమ ఫోన్‌నెంబర్ రాసి ఉన్న పేపరు కవర్‌లో దొరికింది. అందులో ఉన్న నెంబర్‌కు ఫోన్‌చేసి మృతుడి ఫొటో పంపించగా మృతుడు తన తండ్రి పోలు సుదర్శన్ రెడ్డి(56)గా కుమార్తె గుర్తించింది. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం గొరెంకపల్లికి చెందిన తాము మన్నెగూడలో నివాసం ఉంటున్నామని, తన తండ్రి బోర్‌వెల్స్‌లో పనిచేస్తాడని తెలిపింది. పది, పదిహేను రోజులకు ఒకసారి ఇంటికి వచ్చి పోతుంటాడని, వారం నుంచి బోర్‌వెల్స్ పనికివెళ్లినట్లు తాము భావించామని తెలిపింది. ఈమేరకు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి మృతుడి భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దళారులకే దండిగా!

(5వ పేజీ తరువాయి)

నేరుగా పొలాల వద్దే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఎక్కువ శాతం ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో పండించిన వరి ధాన్యం ప్రైవేట్ మార్కెట్‌కు తరలుతోంది. రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. అక్కడ పెడుతున్న కొర్రీలు.. జరుగుతున్న నష్టంతో దళారులు, వ్యాపారుల వైపు చూస్తున్నారు. తరుగు పేరిట కిలోల కొద్దీ ధాన్యాన్ని తీయడం.. తేమ శాతం అధికంగా ఉందంటూ తక్కువ ధరకు కొనుగోలు చేయడం, కొనుగోలు కేంద్రాల్లో ఇస్తున్న మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ మొత్తాన్ని చెల్లిస్తుండడంతో రైతులు వారికే విక్రయిస్తున్నారు. కొన్నిచోట్ల దళారులు క్వింటాలు ధాన్యానికి రూ.2,050 చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు మాత్రం వంద రూపాయలు ఎక్కువగా చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో జిల్లాలోని మెజార్టీ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కాకుండా ప్రైవేట్ మార్కెట్‌లోనే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. దీంతో ధాన్యం రాకపోవడంతో జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

ఈ సారి వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 1,38,187 ఎకరాల్లో వరి సాగుచేశారు. 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వరి ధాన్యం దిగుబడికి అనుగుణంగా జిల్లాలో 38 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏపీపీ పరిధిలో 3, పీఏసీఎస్ పరిధిలో 29, డీసీఎంఎస్ పరిధిలో 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 247 మంది రైతుల నుంచి 1704.760 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకే అమ్ముకుంటున్నారు. కేంద్రాల్లో, మిల్లర్లు తూకంలో భారీగా కోతలు విధించడం, హమాలీ ఖర్చులు తడిసి మోపెడు కావడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అంతంత మాత్రంగానే వస్తుంది.

మద్దతు ధర ఇలా..
- సాధారణ రకం : 2,300
- గ్రేడ్-ఏ : 2,320
- సన్నాలకు బోనస్ : 500

దళారులకు అమ్ముకున్న



ఎకరం 20 గుంటల్లో వరి సాగు చేశా. 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఇంటి అవసరాలకు పోను 17 క్వింటాళ్ల ధాన్యం విక్రయించాను. గత ఏడాది ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు విక్రయిస్తే డబ్బు ఆలస్యంగా అకౌంట్లో జమ చేశారు. నష్టమైన సరే ఈసారి దళారులకు అమ్ముకున్న. క్వింటాకు రూ.2,050 నగదు చెల్లించారు. తాలు, తేమ శాతం ఏమీ చూడలేదు. బయట అమ్మితే క్వింటాకు రూ. 250 నష్టపోయాను.

- బండ యాదయ్య, కందుకూరు మండలం, బేగంపేట

పాల బిల్లులు చెల్లించాలి

కడ్తాల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విజయపాడి రైతులకు నెలల తరబడి పాల బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ కడ్తాల గ్రామాధ్యక్షుడు కడారి రామకృష్ణ అన్నారు. పెండింగ్ బిల్లులను వారం రోజుల్లో చెల్లించకపోతే పాడిరైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం పాడి రైతులతో కలిసి రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాల బిల్లులు సక్రమంగా రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పక్షం రోజులకోసారి చెల్లించాల్సిన బిల్లులు 4 పక్షాలు పూర్తై ఐదో పక్షం గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో పాడి పశువుల పోషణ, దాణ, పశుగ్రాసం కొనుగోలు, కుటుంబ పోషణకు పాడి రైతులు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు.

తులేకలాన్‌లో పశు వైద్యశిబిరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రవణ్

ఇబ్రహీంపట్నం,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధి తులేకలాన్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.శ్రవణ్ పాల్గొని పాడిరైతులకు సలహాలు, సూచనలు చేశారు. వెల్మినేడు పశువైద్యాధికారి డా.అనంతరెడ్డి, సదానందం, గోపాలమిత్రలు జగన్, శంకర్ తదితరులున్నారు.

విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ధ్యేయం


కంటి అద్దాలు అందజేస్తున్న సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, ఉపాధి, గ్రామాల సమగ్రాభివృద్ధే ఐక్యత ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నై శంకరన్ నేత్రాలయం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం బుధవారం రెండోరోజు కొనసాగింది. ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శిబిరం వద్ద పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి, వెల్దండ, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 580 మంది శిబిరానికి హాజరయ్యారు. శిబిరంలో 360 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 250 మందికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. 30 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కంటి సమస్యలతో ఎవరు బాధపడకూడదన్న ఉద్దేశంతో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు మండ్లీ రాములు, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రచ్చ శ్రీరాములు, కొండల్ రెడ్డి, నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్, మల్లేశ్ నాయక్, రఘు, యాదయ్య, రమేశ్ నాయక్, మల్లయ్య, భాస్కర్, కళ్యాణ్ అభినవ్ రెడ్డి, కొండల్ యాదవ్, రమేశ్‌గౌడ్, విడియాల రవి, గన్నోజు సత్యం, ఉమా మహేశ్వర్, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్, ఎంపీహెచ్ఈవో తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే


వీరాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, అంజయ్యయాదవ్, తదితరులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దైవభక్తి ఉంటేనే మానసిక ప్రశాంతతో జీవనం గడుపుతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ఫరూఖ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం, హనుమాన్, వినాయకుడు, నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనను బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయే ఆలయాన్ని నిర్మించి, భక్తితో విగ్రహాల ప్రతిష్టాపన నిర్వహించడం ఎంతో ఆనందమని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజ్, కౌన్సిలర్ శ్రావణి, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరి విశ్వం, శివశంకర్‌గౌడ్, బాబర్ ఖాన్, జమ్రుద్‌ఖాన్, అగ్గనూరి బస్వం, కృష్ణారెడ్డి, కట్టు వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వి.నారాయణరెడ్డి, చీపిరి రవియాదవ్, పట్టణవాసులు గందం ఆనంద్, పిల్లి శేఖర్, చెరుకు శివ, ఆకుల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నదానం మహాపుణ్యం

అయ్యప్పలకు అన్నదానం చేయడం మహాపుణ్యమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయ సన్నిధానంలో ఎమ్మెల్యే సొంత ఖర్చుతో అయ్యప్పలకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. మాజీ ఎంపీ పీ ప్రకాష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలంగౌడ్, సూర్యప్రకాష్, కృష్ణ, వెంకటేష్‌గౌడ్, బస్వం, బీజేపీ నాయకుడు మురళి, నిర్వాహకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

- వృద్ధురాలిని ఆసుపత్రికి తరలించిన సుష్మా మహేందర్‌రెడ్డి


వృద్ధురాలిని ఆసుపత్రికి తరలిస్తున్న సుష్మా మహేందర్‌రెడ్డి

శంషాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. దాదాపు 80 ఏళ్ల వయస్సున్న ఓ వృద్ధురాలిని రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు శంషాబాద్‌లోని స్ట్రీట్‌నెంబర్ 14లో వదిలిపెట్టారు. బస్తీవాసులు ఆమెకు భోజనం పెట్టి కప్పుకోవడానికి దుప్పటి ఇచ్చారు. ఈ విషయం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రతినిధి మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డితో పాటు ఏసీపీ కేఎస్ రెడ్డికి సమాచారం అందించారు. ఏసీపీ సిబ్బందిని వృద్ధురాలి వద్దకు పంపి వివరాలు తెలుసుకున్నారు. చైర్‌పర్సన్ స్థానిక వృద్ధాశ్రమాలను సంప్రదించగా అనాథలు నడిచే స్థోమత ఉంటే ఆశ్రయం కల్పిస్తామని చెప్పారు. చైర్‌పర్సన్ వృద్ధురాలిని అంబులెన్సులో ముందుగా ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి పంపి ఆరోగ్యం కొంత మెరుగుపడ్డాక వృద్ధాశ్రమంలో చేర్పిస్తామని తెలిపారు. అయితే వృద్ధురాలు తన పేరు బీజాన్‌బీ అని, భర్త పేరు యూసుఫ్‌మియా అని, తనకు ఏపీలోని నెల్లూరు పట్టణంలో కుటుంబం ఉందని, తనవాళ్లే ఇక్కడ వదిలివెళ్లారని చెప్పింది. ఒకసారి తానే రైలులో ఇక్కడి వచ్చినట్టు మరోసారి పొంతనలేని సమాధానాలు చెపుతుందని సుష్మామహేందర్‌రెడ్డి తెలిపారు. వృద్ధురాలి సమాచారం తెలిపినందుకు ఆమె బస్తీవాసులకు, సమాచారం ఇచ్చిన విలేకరులకు కృతజ్ఞతలు తెలిపారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యేలు కసిరెడ్డి, రాజేశ్‌రెడ్డి

వధూవరులకు ఎమ్మెల్యేల ఆశీర్వాదం

ఆమనగల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు కాయితీ చెన్నారెడ్డి-హైమావతి దంపతుల కుమారుడు శరత్‌రెడ్డి-దర్శిత వివాహ వేడుకలు బుధవారం పరిణయ కన్వెన్షన్ హాల్‌లో జరిగాయి. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, గూడూరు భాస్కర్‌రెడ్డి, అండేకార్ యాదిలాల్, తదితరులు ఉన్నారు.

20వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తేల్చి చెప్పారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 20వ రోజుకు చేరాయి. గ్రామంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ర్యాలీ తీశారు.

సంక్షిప్తంగా

- **తలకొండపల్లి** : పొదుపు సంఘాల మహిళలు సంఘటితంగా ముందుకుసాగి తమ శక్తిని చాటాలని ఏపీఎం శ్రీదేవి కోరారు. లింగరావుపల్లిలో మహిళా శక్తి వారోత్సవాలు నిర్వహించారు. కొత్తగా ఏర్పాటుచేసిన మహిళా సంఘాల సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి పాసుబుక్‌లు అందజేశారు. సీసీలు దీప, రాములు, వీవోఏలు, సభ్యులు పాల్గొన్నారు.
- **శంకర్‌పల్లి** : అయ్యప్పమాల ధరించి దర్గాకు వెళ్లడం హిందూ మతాన్ని అవమానించడమేనని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సురేష్ కురుమ ఆరోపించారు. శంకర్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ సినీహీరో రామ్‌చరణ్ అయ్యప్పమాల ధరించి కడపదర్గాను దర్శించడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు.
- **కడ్తాల్** : సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని, సేవలతోనే సమాజంలో కీర్తి లభిస్తుందని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ కోరారు. మండల కేంద్రంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గంప విశ్వనాథం స్మారకార్థం అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.
- **షాద్‌నగర్ అర్బన్** : రైల్వే బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్న రోడ్డుపై మట్టిని పోయించి, మరమ్మతు చేయించిన మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాష్‌గౌడ్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చటాన్‌పల్లి రోడ్డు రైల్వే క్రాసింగ్‌పై బ్రిడ్జి నిర్మాణం కోసం పెద్ద గోతులు తీసి, పిల్లరు వేసి వదిలేశారు. గోతులు ఏర్పడి, వాహనాల పోకరాకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ప్రకాష్‌గౌడ్ ముందుకొచ్చి మట్టి పోయించి, రోడ్డుపై గోతులను పూడ్చివేయించారు.
- **షాద్‌నగర్ అర్బన్** : హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో నేటినుంచి ప్రారంభమయ్యే లోక్‌మంథన్‌లో షాద్‌నగర్ కళాకారులు నటనను ప్రదర్శించబోతున్నారు. షాద్‌నగర్ సాహితీ కళా భారతికి చెందిన హరీష్‌శర్మ, ఆనందీశ్వర్‌రెడ్డి, ఆకుల మల్లికార్జున్, లక్ష్మీకాంత్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు శుక్రవారం భువనవిజయం నాటకాన్ని ప్రదర్శిస్తుండగా.. మొగిలిగిద్దకు చెందిన మృదుల యువరాణి పాత్రను పోషించనుంది.
- **షాద్‌నగర్ అర్బన్** : మాల మహానాడు ఫరూఖ్‌నగర్ మండల నూతన కమిటీని ఎన్నిక చేసినట్టు జిల్లా అధ్యక్షుడు మహేష్‌మాల తెలిపారు. అధ్యక్షుడిగా చింటోటి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా బ్యాగరి బాల్‌రాజ్, ఉపాధ్యక్షులుగా మాల యాదగిరి, దార శివశంకర్, బర్ల శ్రీనివాస్, లింగం శేఖర్, కోశాధికారిగా కె.ప్రవీణ్‌కుమార్, సలహాదారులుగా బి.బలరాం, యాదయ్య, రాజు, రవికుమార్, మల్లేష్, జంగయ్య, యాదగిరిలను ఎన్నుకున్నట్టు తెలిపారు. మాజీ ఎంపీటీసీ రామకృష్ణ నియామకపత్రాలు అందజేశారు.
- **కడ్తాల్** : మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి భానునాయక్ ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరంలో దూడలకు నులిపురుగుల నివారణ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరుల్లున్నారు.

మక్తమాదారం-ఇబ్రహీంపట్నం బస్సు సర్వీసు ప్రారంభం


సర్వీసును ప్రారంభిస్తున్న నర్సింహ, సాయిలు, నాయకులు

కడ్తాల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్తమాదారం గ్రామం నుంచి ఇబ్రహీంపట్నంకు నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసు ను ప్రారంభించారు. బుధవారం మక్తమాదారంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, మాజీ ఎంపీటీసీ మంజుల చంద్రమౌళిలు సర్వీసును ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి ఏర్పాటు చేసిన బస్సు మక్తమాదారం నుంచి ఇబ్రహీంపట్నం వరకు ప్రతీ రోజు మూడు ట్రిప్పులు నడుస్తుందని వారు తెలిపారు. ఉదయం 5.15, 6.30, 10 గంటలకు బస్సులు బయలు దేరుతాయని తెలిపారు. విద్యార్థులు, ప్రయాణికులకనుగుణంగా బస్సు సౌకర్యాన్ని కల్పించిన ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డీఎంకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నర్సింహగౌడ్, జంగయ్య, యాదగిరి, శ్రీనివాస్, మహేందర్, నాగేశ్, చెన్నయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ శివారులో గల జేపీ దర్గాలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక విద్యుత్ ఏఈ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఇన్ముల్‌నర్వ సబ్‌స్టేషన్‌లోని 11కేవీ జేపీ దర్గా ఫీడర్ పరిధిలో మరమ్మతులతో పాటు ట్రీ కటింగ్ ఉన్నందున ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): లెక్చరర్లు బోధిస్తున్న పాఠాలను శ్రద్ధగా విని సరికొత్త ప్రయోగాలు చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి శ్రమించాలని తెలంగాణ హెడ్ ప్లేస్‌మెంట్, కార్పొరేట్ రిలేషన్స్ టాస్క్ అధిపతి ఎ.ప్రదీప్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పల్లి సమీపంలోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎడ్యునెట్ సౌజన్యంతో సాప్ తరగతుల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్‌ను ప్రారంభించి మాట్లాడారు. నేడు పోటీతత్వం బాగా పెరిగిందని, అందుకనుగుణంగా విద్యార్థులకు ఆధునిక పద్ధతులతో బోధన చేస్తే ఎంతోబాగుంటుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని 116 కళాశాల్లో విశ్వేశ్వరయ్య కాలేజీలో కూడా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ ఇంజనీరింగ్ టెక్నాలజీస్ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కళాశాల చైర్మన్ కె.లక్ష్మీనారాయణ, గెస్ట్ ఆఫ్ ఆనర్స్ ఎండీ అఫ్సర్‌బాషా, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రమేష్, కళాశాల కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకోవాలి



శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి అనిత

షాబాద్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని షాబాద్ పంచాయతీ కార్యదర్శి అనిత అన్నారు. బుధవారం షాబాద్‌లో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు అల్లికలు, కుట్టు శిక్షణ శిబిరంలో 40 మందికి శిక్షణ అందించారు. కార్యక్రమంలో శిక్షణ ట్రైనర్ సుభాషిణి, వెల్‌స్పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల డివిజన్‌లో 83 శాతం సమగ్ర సర్వే పూర్తి

చేవెళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం గ్రామాల్లో జోరుగా కొనసాగుతోంది. చేవెళ్ల డివిజన్ పరిధిలో దాదాపుగా పూర్తి కావవచ్చింది. మొత్తం ఇళ్లు 70,689 ఉండగా.. 58,448 ఇళ్లకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. ఇప్పటి వరకు డివిజన్‌లో మొత్తం 83 శాతం సర్వే పూర్తి చేశారు. చేవెళ్ల మండలంలో 17,023 ఇళ్లు ఉండగా 14,020, మొయినాబాద్‌లో 17,799 ఇళ్లకు గాను 14,864. శంకర్‌పల్లి మండలంలో 13,742 ఇళ్లకుగాను 11,432 ఇళ్లలో సర్వే పూర్తి చేశారు. షాబాద్ మండలంలో 15,272 ఇళ్లు ఉండగా.. 11,779 పూర్తయ్యాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో 6,853 ఇళ్లు ఉండగా వంద శాతం సర్వే పూర్తి చేశారు. మరో ఒకటి రెండు రోజుల్లో ఎన్యుమరేటర్లు అన్ని మండలాల్లో వంద శాతం సర్వే పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

దేవుడిని చూసొస్తానని చెప్పి, గుట్ట పైనుంచి కిందికి దూకి..

మతిస్థిమితం లేని వ్యక్తికి తీవ్ర గాయాలు

- క్షతగాత్రుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు
- వివరాలు సేకరించిన ఏసీపీ కేపీవీ రాజు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్లో రామాంజనేయులు

యాచారం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మానసికస్థితి సరిగాలేని ఓ వ్యక్తి తాను దేవుడిని చూసొస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి గుట్ట నుంచి దూకడానికి యత్నించి గాయాలపాలయ్యాడు. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అతడిని యాచారం పోలీసులు కాపాడారు. యాచారం ఎస్సై మధు కథనం మేరకు.. నగరంలోని మౌలాలికి చెందిన రామాంజనేయులుకు మానసిక స్థితి సరిగా ఉండదు. అయితే, తాను దేవుడిని చూస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి బుధవారం ఏనెకింది తండా సమీపంలోని ఓ గుట్టపై నుంచి కిందకు దూకాడు. ఈక్రమంలో అతడు బండరాళ్ల మధ్య ఇరుక్కుపోయాడు. అనంతరం రోదిస్తుండగా తండాకు చెందిన సబావత్ వినోద్ గమనించి ఎస్సై మధుకు సమాచారమందించాడు. కానిస్టేబుళ్లు శంకర్, శేఖర్, హోంగార్డులు మహేందర్, తిరుపతిలతో కలిసి క్షతగాత్రుడిని అతికష్టం మీద బయటకు లాగారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అంబులెన్స్ తెప్పించి బాధితుడిని ఇబ్రహీంపట్నంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాధితుడి కుటుంబికులకు పోలీసులు సమాచారమందించారు. రామాంజనేయులు ప్రాణాలు కాపాడిన ఎస్సైతో పాటు స్టేషన్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమావేశానికి ఎంపీడీవో గైర్హాజరు

- పంచాయతీ కార్యదర్శుల అసహనం!

చౌదరిగూడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మిఅనురాధ బుధవారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఉందని సమాచారం అందించారు. కానీ, ఆమె మాత్రం హాజరుకాలేదు. దాంతో పంచాయతీ కార్యదర్శులు ఆమె రాక కోసం మీటింగ్ హాల్‌లో కూర్చొని చాలాసేపు వేచి చూశారు. అయితే, ఎంపీడీవో గైర్హాజరుపై ఫోన్ చేయగా తీయలేదు. మండల అధికారి తీరు పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.